క్లుప్తంగా

నేడు పాచిపెంటలో డిప్యూటీ సీఎం ఎన్నికల ప్రచారం

సాలూరు: పాచిపెంట మండల కేంద్రంలో ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. రాజన్నదొర ఎన్నికల ప్రచారానికి వస్తున్న క్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

సీతారాముల కల్యాణానికి ముహూర్తపు రాట



డబ్బివీధిలో రామమందిరం వద్ద వేస్తున్న ముహూర్తపు రాట

సాలూరు: శ్రీరామనవమి వసంత నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణానికి ముహూర్తపు రాటలను శుక్రవారం వేశారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని డబ్బివీధి, గాడివీధిలలో గల రామాలయాల వద్ద ముహూర్తపు రాటలను శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేసి వేశారు. ఈ కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తుల రాకతో ఆధ్యాత్మికతతో కూడిన వాతావరణం నెలకొంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సాలూరు: మండలంలోని మామిడిపల్లి, గంగందొరవలస సబ్‌స్టేషన్‌ల పరిధి గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మెయింటనెన్స్ పనులు చేపడుతున్న నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహన తనిఖీలు చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

పార్వతీపురం టౌన్: రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు వాహనాల తనిఖీ ముమ్మరంగా జరుగుతోంది. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని రాష్ట్ర రహదారిపై వైకేఎంకాలనీ, పాత బస్టాండ్, రైల్వేస్టేషన్ జంక్షన్‌లలో వాహనాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికార సిబ్బంది ఆర్‌ఐ నారాయణరావు మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అనుమతులు లేకుండా వాహనాల్లో నగదు తరలించరాదని, నిషేధిత సరుకులు తరలించడం నేరమన్నారు. వాహనాల తనిఖీల్లో నగదు, నిషేధిత సరుకులు పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే రోజుకు మూడు షిఫ్టులతో 24 గంటలూ వాహనాల తనిఖీ చేయనున్నట్లు చెప్పారు. అధికారులకు వాహన చోదకులు సహకరించాలని కోరారు.

గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్



గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

పాచిపెంట: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పాచిపెంట ఎస్సై నారాయణ ఆధ్వర్యంలో మండలంలో విస్తృతంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నారు. పోలీసులు, ప్రత్యేక బలగాలు కలిసి శుక్రవారం కందిరివలస, గుంటమామిడివలస, చెరుకుపల్లి గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ చేశారు. ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా అందరూ బాధ్యతగా నడుచుకోవాలని ఎస్సై ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

రేషన్ కార్డుదారుల నుంచి ఫిర్యాదులు రాకూడదు

పార్వతీపురంటౌన్: రేషన్ కార్డుదారుల నుంచి ఏ విధమైన ఫిర్యాదులు రాకుండా వారికి నిత్యావసరాలు అందించాలని తహసీల్దార్ కె.ఆనందరావు ఆదేశించారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలోని 21వ వార్డు లింగంవీధి రేషన్ డిపో పరిధి ఎండీయూ వాహనాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ కోసం వచ్చిన కార్డుదారులతో స్వయంగా మాట్లాడారు. వాహనంలో ఉన్న స్టాకుకు మెషీన్‌లో నమోదైన స్టాక్ నిల్వలను తనిఖీ చేశారు. ఎండీయూ వాహనం ఆపరేటర్‌తో మాట్లాడుతూ కచ్చితంగా సమయ పాలన పాటించాలని, కార్డుదారుల ఇంటి దగ్గర వాహనం ఆపి సరుకులను పంపిణీ చేయాలని ఆదేశించారు. రేషన్ పంపిణీ విషయంలో కార్డుదారుల నుంచి ఏవిధమైన ఫిర్యాదులు వచ్చినా సహించేది లేదని స్పష్టం చేశారు. రేషన్ పంపిణీకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున వలంటీర్లు సేవలు అందించరాదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రామకృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందరి వాడు జగన్‌ను ఆదరించండి



పట్టణంలోని 26వ వార్డులో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఎన్నికల ప్రచారం



బలిజిపేట: పెద పెంకిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: కులమతాలు, పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అందరివాడుగా ముద్రపడిన జగనన్నను రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని పార్వతీపుం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పట్టణంలోని 26, 27 వార్డుల్లో శుక్రవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న మళ్లీ సీఎం అయితే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ ఫలాలు ఇంటి వద్దే అందుతాయన్నారు. టీడీపీ మాత్రం అధికారంలోకి వస్తే గతంలో మాదిరి జన్మభూమి కమిటీలు పెత్తనం చెలాయిస్తాయని గుర్తు చేశారు. ఇంటి వద్దే పెన్షన్ తీసుకుంటే అవ్వా తాతలు, దివ్యాంగులు, వితంతువులు జగన్‌కే ఓట్లేస్తారనే ఉద్దేశంతో కుట్ర చేసి చంద్రబాబు నాయుడు దాన్ని కూడా అడ్డుకున్నారని విమర్శించారు. టీడీపీకి పొరపాటును మళ్లీ ఓటు వేస్తే మళ్లీ చీకటి రోజులు తప్పవని గుర్తు చేశారు. అందరికీ మేలు చేసే జగన్ సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేలా ఎమ్మెల్యేగా తనను, అరకు ఎంపీగా డాక్టర్ గుమ్మ తనూజా రాణిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వర రావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, స్థానిక వార్డు కన్వీనర్ రెడ్డి మాధవి, కోరాడ శ్రీనివాసరావు, మజ్జి శశికర్, సువ్వాడ లావణ్య, నిమ్మకాయల సుధీర్‌కుమార్, రణభేరి చిన్నం నాయుడు, ఎడ్ల త్రినాథ, జోత్స్న ఆనంద్, జె.దివ్య, మజ్జి నాగమణి, పి.జయంతి, నేతాజీ, తాడ్డి శంకరరావు, గుంట క్రాంతి, నాయకులు గృహ సారథులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మేలు చేసే ప్రభుత్వానికి మద్దతు పలకండి

బలిజిపేట: ప్రజలకు మేలు చేసే ప్రభుత్వానికి మద్దతు పలికి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పెదపెంకిలో శుక్రవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి నిరుపేదకు మేలు జరిగిందన్నారు. గత ప్రభుత్వ పనితీరును, ఈ ప్రభుత్వ పనితీరుతో పోల్చి ప్రజలకు మేలు జరిగిందో? లేదో? అన్నది గుర్తించి ప్రభుత్వానికి మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం హయాంలో పేదలకు సంక్షేమ పథకం అందని ద్రాక్షలా ఉండేదని, గడిచిన 5సంవత్సరాల కాలంలో ఇంటివద్దే కూర్చుంటే అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందివచ్చాయని తెలిపారు. ప్రచార కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.పాపారావు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, ఎంపీటీసీ సునీత, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, అప్పలనాయుడు మాస్టారు, సీహెచ్.సత్యంనాయుడు, వైఎస్సార్‌సీపీ మహిళా సంఘం మండల అధ్యక్షురాలు దుర్గేశ్వరి, సర్పంచ్‌లు ఆర్.శ్రీనివాసరావు, విజయ, కె.మోహనరావు, ఎ.సుందరరావు, ఎంపీటీసీలు మల్లిక, జి.ప్రభావతి, జి.పకీరునాయుడు, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జన ప్రభంజనం



గ్రామస్థులు సత్కరించిన పూలదండలతో డిప్యూటీసీఎం రాజన్నదొర, మావుడి సోదరులు

- కొండరేజేరు, కాశీపట్నం గ్రామాల్లో రాజన్నదొర ప్రచారం



డిప్యూటీ సీఎం రాజన్నదొర నుదుట కుంకమ దిద్ది, పూలు జల్లుతున్న మహిళలు

మక్కువ: మండలంలోని కాశీపట్నం, కొండరేజేరు గ్రామాలలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా కొండరేజేరు గ్రామానికి చేరుకున్న మంత్రి రాజన్నదొరకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. పూలదండలతో సత్కరించారు. ప్రచారంలో పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి మంత్రి రాజన్నదొర ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గ్రామంలో మహిళలు మంత్రి రాజన్నదొర నుదుట కుంకమ దిద్ది, హారతులు పట్టారు. జగనన్నకే మా ఓటు అంటూ మహిళలు పెద్ద ఎత్తున నినాదించారు.

మరో రెండు నెలలు పింఛన్ కష్టాలు

అవ్వాతాతలను మంత్రి రాజన్నదొర పలకరించగా, వలంటీర్ల సేవలు ఎన్నికలకోడ్ వల్ల ఆగిపోవడంతో, పింఛన్ పాట్లు మళ్లీ మొదలయ్యాయి నాయనా అంటూ వాపోయారు. రెండునెలలు మాత్రమే ఈ ఇబ్బందులు ఉంటాయని, జగనన్న మరోసారి ముఖ్యమంత్రి అవుతారని, అయిన వెంటనే మీ ఇంటికే ప్రతినెలా 1వతేదీన వలంటీర్లు వచ్చి పింఛన్ సొమ్ము అందిస్తారని, అధైర్యపడవద్దని మంత్రి రాజన్నదొర అవ్వాతాతలకు భరోసా ఇచ్చారు. అనంతరం కాశీపట్నం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, సర్పంచ్‌లు చంద్రావు, బెల్లాన కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు పెంట సంజీవు నాయుడు, కోట్ల నారాయణరావు, తేలు శ్రీరాములునాయుడు, చప్ప సూర్యనారాయణ, బొంగు భీమలింగేశ్వర్రావు, పూడి శ్రీను, తిరుపతి పాల్గొన్నారు.

భగ్గుమంటున్న ఎండ

- 41 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత
- అవస్థలు పడుతున్న ప్రజలు



తలకు వస్త్రాలు చుట్టుకుని నడుస్తున్న మహిళలు

సీతానగరం: ఉదయం నుంచే భానుడు ప్రతాపం చూపడంతో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల పాదచారులు, వాహన చోదకులు నీడ కోసం పరుగులు తీస్తున్నారు. ఆస్పత్రులు, బ్యాంక్‌ల పనులపై వచ్చిన మహిళలు ఎండను తట్టుకోలేక తలపై చీరు కొంగు, కాళ్లకు చెప్పులు ధరించి మండుటెండలో స్వగ్రామాలకు వెళ్తున్నారు. అలాగే వాహన చోదకులు హెల్మెట్, టోపీలు ధరించి ప్రయాణం చేస్తున్నారు. ఇంతటి ఎండలు గతంలో ఎప్పుడూ ఎదుర్కోలేదని పాదచారులు అంటున్నారు. పచ్చని చెట్లుండి దట్టమైన నీడనిచ్చే చెట్లను వాహన చోదకులు వెతుక్కుంటున్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న డాక్టర్ బి.పావని

ఎండలు తీవ్రంగా ఉన్నందున మండలంలోని ప్రజలు వెడదెబ్బకు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ బి.పావని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమె పీహెచ్‌సీలో తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం నుంచే ఉష్ణోగ్రత పెరడం వల్ల వ్యవసాయ పనులకు, అత్యవసర పనుల్లో ఇంటినుంచి బయటకు వెళ్లేవారు ఉదయం 10 గంటలలోపే పనులు ముగించుకుని తిరిగి ఇళ్లకు చేరుకుని సేదదీరాలని, సాయంత్రం 5 గంటల తరువాత పొలం పనుల్లో పాల్గొనాలని సూచించారు. పిల్లలు, వృద్ధులు, గుండెకు సంబంధించిన వ్యాధిగ్రస్థులు, సుగర్, క్షయ ఉన్న వారు మరిన్ని జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. పొలం పనుల్లో ఉన్న వారంతా స్థానిక వెల్‌నెస్ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న 'ఓఆర్‌ఎస్' ద్రావణాన్ని తాగాలని, జింక్ కంటెంట్ ఉన్న మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఎండలో తిరుగాడే ప్రజలు కాళ్లకు పాదరక్షలు ధరించాలని, తలకు తెల్లని వస్త్రంతో పాగా, తెల్లని దుస్తులు ధరించాలని చెప్పారు. వాహన చోదకులు ఎండకు గురికాకుండా ఉండేందుకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లవద్ద సేదదీర్చుకోవాలని తెలిపారు. వడదెబ్బకు గురైనవారు స్థానిక పీహెచ్‌సీలో కానీ సమీపంలో ఉన్న వెల్‌నెస్ కేంద్రాల్లో కానీ వైద్య సేవలు పొందాలని కోరారు. వడదెబ్బకు గురైన వారికి నిరంతరం వైద్య సేవలందించడానికి అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్.వెంకట రమణ,హెల్త్ సూపర్‌వైజర్ శర్మ పాల్గొన్నారు.

మక్కువ టీడీపీలో వీడని వర్గపోరు

- సంధ్యారాణి ప్రచారానికి ఎంపీటీసీ దంపతుల డుమ్మా

మక్కువ: మండలంలోని కాశీపట్నం గ్రామంలో టీడీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎంపీటీసీ కోట జయమ్మ, మాజీ సర్పంచ్ కోట శంకరనాయుడులు పాల్గొనలేదు. శంకరనాయుడుకు కాశీపట్నం పంచాయతీలో మంచి పట్టుంది. అంతేకాకుండా సీనియర్ నాయకుడు, రాజకీయంగా ఎత్తుకు పై ఎత్తులు వేసే రాజకీయ ఉద్దండుడిగా ఆయనకు పేరుంది. ఆయన భార్య కోట జయ ప్రస్తుతం ఎంపీటీసీ సభ్యురాలు. శుక్రవారం కాశీపట్నం గ్రామంలో నిర్వహించిన టీడీపీ ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో శంకరనాయుడు పాల్గొంటారని, సంధ్యారాణి వర్గీయులు భావించినప్పటికి, చివరి నిమిషంలో ఏం జరిగిందో ఏమోగాని శంకరనాయుడు దంపతులు, వారి అనుచరుల జాడ కనిపించలేదని బహిరంగంగానే చర్చించుకున్నారు. ఇప్పటికే మక్కువ టీడీపీలో రెండు వర్గాలు నడుస్తున్నాయి. టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు పెంట తిరుపతిరావు వర్గం, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి వర్గానికి పడడం లేదు. కనీసం ఎన్నికల ప్రచారం సమయంలోనైనా కలుస్తారేమోనని ఇరువర్గాల గ్రామస్థాయి టీడీపీ నాయకులు భావిరచారు. అయితే ఒకరు పంతంకోసం, ఒకరు పట్టుకోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారే తప్ప, పార్టీ ప్రయోజనాలకోసం ఆలోచించడంలేదని పలువురు తెలుగు తమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల శంబర గ్రామంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిర్వహించిన ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు, ఆయన అనుచరవర్గం పాల్గొనలేదు. శుక్రవారం కాశీపట్నం ఎంపీటీసీ కోట జయమ్మ ప్రచారంలో పాల్గొనలేదు. శంబర, కాశీపట్నం పంచాయతీల ఎంపీటీసీలు పెంట తిరుపతిరావు వర్గానికి చెందినవారే. ఆ ఇద్దరు ఎంపీటీసీలు ప్రచారంలో పాల్గొనకపోవడంతో సంధ్యారాణి, తిరుపతిరావులు పంతాలు, పట్టింపులకే అధిక ప్రాధాన్యమిస్తున్నారని, పార్టీకోసం ఆలోచనచేయడంలేదని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.

పెన్షన్ కష్టాలకు కారణం చంద్రబాబే

- వైఎస్సార్‌సీపీ జిల్లా కన్వీనర్ దండి శ్రీను



సాలూరు రూరల్: అవ్వాతాతలు, దివ్యాంగుల పెన్షన్ కష్టాలకు చంద్రబాబునాయుడు చేసిన ఫిర్యాదులే కారణమని వైఎస్సార్‌సీపీ జిల్లా కన్వీనర్ దండి శ్రీను అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తేదీన ఇంటి గుమ్మం ముందుకు తెచ్చి పెన్షన్ అందించే వలంటీర్లపై కక్షగట్టి వారితో పెన్షన్లు పంచనీయకుండా నిరోధించిన చంద్రబాబునాయుడు వృద్ధులు, దివ్యాంగుల శాపనార్థాలకు బలి కాక తప్పదని చెప్పారు. దూర ప్రాంతాల నుంచి అతి కష్టం మీద సచివాలయాలకు చేరుకుని అక్కడ గంటల తరబడి క్యూలో నిలబడి పెన్షన్ అందుకోవాల్సిన దుస్థితి మళ్లీ వచ్చిందని ఆవేదన వెలిబుచ్చారు. సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా అందించడం చంద్రబాబునాయుడికి ఇష్టలేదని అందుకే ఇలాంటి అడ్డంకులు పెడుతున్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేది జగన్‌మోహన్ రెడ్డేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేకు సంగంవలస గ్రామస్తుల మద్దతు



ఎమ్మెల్యే జోగారావును కలిసిన సంగంవలస గ్రామస్తులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలంలోని సంగంవలస గ్రామానికి చెందిన ప్రజలు ఎమ్మెల్యే అలజంగి జోగారావును క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని తమ మద్దతు తెలియజేశారు. మళ్లీ తమ ప్రజా నాయకుడికే రెండవ సారి వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఎమ్మెల్యే టికెట్ కేటాయించడం తమకు చాలా సంతోషంగా ఉందని, తమ గ్రామమంతా ఎమ్మెల్యే జోగారావు వెంట నిలిచి ఈ సాధారణ ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి బహుమతిగా అందజేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా సంగంవలస గ్రామస్తులకు ఎమ్మెల్యే జోగారావు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయం ప్రథమ వార్షికోత్సవం



చిన్నారాయుడుపేటలో జరుగుతున్న రామాలయం ప్రథమవార్షికోత్సవ పూజలు

సీతానగరం: మండలంలోని చిన్నారాయుడుపేటలో సూరంపేట మాజీ సర్పంచ్ సీహెచ్ సాంబందొర, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రామమందిరం ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ మేరకు కమిటీ సభ్యులు నాగరాజు, సాంబందొర మాట్లాడుతూ అలయ అర్చకుడు మైలారభట్ల ప్రసాద్ శర్మ పర్యవేక్షణలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషిఫలితంగా చిన్నారాయుడుపేటలో రామమందిరం నిర్మించడానికి సమరసత సేవాసమితి, టీటీడీ ప్రచార కమిటీ ద్వారా, ప్రజలు సమకూర్చిన నిధులతో 2023 ఏప్రిల్ 5న ఆలయ ప్రతిష్ట నిర్వహించినట్లు చెప్పారు. రామాలయం నిర్మాణం పూర్తయి ఏడాది కావడంతో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సహకారంతో ప్రథమ వార్షికోత్సవాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించి సూరంపేట పంచాయతీలో ఉన్న మరిపివలస, సూరంపేట, చిన్నారాయుడుపేట, పొరుగు గ్రామాల ప్రజలకు అన్న ప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి చిట్టిరాజు, మాజీ ఎంపీపీ బి.వరలక్ష్మి, సర్పంచ్ సిట్టపులి అప్పన్నమ్మ, కమిటీ సభ్యులు పి సీతయ్య, కె శంకరరావు, నాగభూషణపట్నాయక్, కోలాటం కళాకారుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓ శ్రీరాములునాయుడు మృతి



శ్రీరాములునాయుడు మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: మండలంలోని కందులపథం గ్రామానికి వీఆర్‌ఓగా పనిచేస్తూ సాలూరు పట్టణంలోని బోరబందలో నివాసముంటున్న గొర్లి శ్రీరాములు నాయుడు(57) మృతిచెందారు. మంగళవారం కార్యాలయంలో ఆయన విధులు నిర్వహించి, భోజనం నిమిత్తం పట్టణంలోని ఇంటికి వెళ్తున్న సమయంలో గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయనను విజయనగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. శ్రీరాములునాయుడు గతంలో సాలూరు, పాచిపెంట, రామభద్రపురం మండలాల్లో వీఆర్‌ఓగా విధులు నిర్వహించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ వార్త తెలుసుకున్న ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర శుక్రవారం ఉదయం పట్టణంలోని బోరబందలో గల ఆయన ఇంటికి వెళ్లి శ్రీరాములు నాయుడు మృతదేహాన్ని సందర్శించి, కుటుంబసభ్యులను పరామర్శించారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్



పార్వతీపురం టౌన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సీతానగరం: బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ బాబ్జీ, సర్పంచ్ కృష్ణ తదితరులు

పార్వతీపురంటౌన్: అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన ఆదర్శమూర్తి బాబా జగ్జీవన్ రామ్ అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కొనియాడారు. బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శుక్రవారం పార్వతీపురం పట్టణ ప్రధాన రహదారి వద్ద ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ సామాజిక స్పృహతోనే సామాన్యుడు అసామాన్యుడుగా ఉద్భవిస్తాడని, అనుకున్నది సాధించిన వ్యక్తి బాబు జగ్జీవన్‌రామ్ అన్నారు. రాజకీయంలో ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వర రావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

భారత మాజీ ఉప రాష్ట్రపతి, బాబూ జగ్జీవన్ రామ్ సేవలను యువకులు స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి సేవలందించాలని జెడ్పీటీసీ మామిడి బాబ్జీ అన్నారు. ఈ మేరకు శుక్రవారం లచ్చయ్యపేటలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ, ఎంపీటీసీ సింహాచలం ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ 117 జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి మహనీయుడు భారతదేశానికి చేసిన సేవలను గుర్తు చేస్తూ ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.కృపారావు, ఎల్లయ్య, విజయ్, పకీరు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్‌కు నివాళులు

పార్వతీపురంటౌన్: బాబూ జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో తహసీల్దార్ కె. ఆనందరావు శుక్రవారం బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్ రామ్ సేవలను తహసీల్దార్ కొనియాడారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణ కష్టాలు మాయం

- 15 గ్రామాలను అనుసంధానం చేస్తూ బీటీ రోడ్ల నిర్మాణం



వంతరాం నుంచి కొత్తవంతరాం గ్రామానికి నిర్మించిన బీటీరోడ్డు



అరసాడ జంక్షన్ నుంచి చెల్లెంపేటకు నిర్మించిన రోడ్డు

బలిజిపేట: దశాబ్దాల కాలం నుంచి రోడ్డు సమస్యతో సతమతమవుతున్న గ్రామాలను అనుసంధానం చేస్తూ బలిజిపేట మండలంలోని 15గ్రామాలకు రూ.13కోట్ల పై చిలుకు నిధులతో బీటీ రోడ్ల నిర్మాణం ముమ్మరంగా జరిగింది. దీంతో వివిధ గ్రామాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో రోడ్డు సదుపాయం కల్పించండి మహాప్రభో అని మొర పెట్టికున్నా పట్టించుకున్న నాయకుడే కరువయ్యాడు. గతంలో అత్యవసర పరిస్థితుల్లో గ్రామాల నుంచి బయటకు వచ్చేందుకు అవకాశాలు లేకుండా పోయేవి. కనీసం ద్విచక్ర వాహనాలపై అయినా వచ్చేందుకు వీలుండేది కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన 5సంవత్సరాల కాలంలోనే గ్రామాలకు బీటీ రోడ్లు వేయడంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం లేకుండా ఉంది. ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఆర్‌అండ్‌బీ, పీఆర్ శాఖలకు చెందిన వివిధ రకాల గ్రాంట్లతో రోడ్ల నిర్మాణం జరిగింది. వాటిలో వంతరాం నుంచి కొత్తవంతరాం గ్రామానికి రూ.95లక్షలతో 2.1కిలోమీటర్ల మేర రోడ్డు, నూకలవాడకు రూ.90లక్షలతో 1.94 కిలోమీటర్ల రోడ్డు, తుమరాడ జంక్షన్ నుంచి చెల్లెంపేటకు రూ.1.35కోట్లతో 2.2కిలోమీటర్ల రోడ్డు, అంపావల్లి నుంచి వంతరాం ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రూ.25లక్షలతో 430మీటర్ల రోడ్డు, వంతరాం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పెదపెంకికి రూ.1.72కోట్లతో 2.65కిలోమీటర్ల రోడ్డు, వెంగాపురం సంతతోట నుంచి తుమరాడకు రూ.25లక్షలతో రోడ్డు, నారాయణపురం వంతెన నుంచి పదమాయవలస జంక్షన్‌కు రూ.1.48కోట్లతో 1.8కిలోమీటర్ల రోడ్డు, నారాయణపురం బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు రూ.15లక్షలతో, పి.రావివలసకు రూ.70లక్షలతో 970మీటర్ల రోడ్డు, చెల్లెంపేట నుంచి అరసాడ జంక్షన్‌కు రూ.90లక్షలతో 800మీటర్ల బీటీ రోడ్డు, పణుకువలస జంక్షన్ నుంచి శివరాంపురానికి రూ.65లక్షలతో 600మీటర్ల రోడ్డు, సుభద్ర చెరువు గట్టుపై నుంచి బర్లి వరకు రూ.1కోటితో రోడ్డు నిర్మాణం, అజ్జాడ నుంచి పి.చాకరాపల్లి వరకు రూ.2.80కోట్లతో 5.2కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణం జరిగింది. ఇవికాక శ్రీరంగరాజపురం, కె.గలావల్లి గ్రామాల రహదారుల పనులు నిర్వహిస్తున్నారు.